క్లుప్తంగా

రక్తపరీక్ష తర్వాతే వైద్యపరీక్షలు



గర్భిణులకు రక్త పరీక్షలు చేయిస్తున్న వైద్య సిబ్బంది

పాలసముద్రం: మండలంలోని గర్భిణులు రక్త పరీక్షలు చేసుకున్న తర్వాతనే నెలసరి వైద్యపరీక్షలు చేసుకోవాలని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ఆరోగ్య ఉపకేంద్రంలో 15 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి రిపోర్టులు అందజేశారు. సూపర్‌వైజర్ మురళి, సుశీల, ఏఎన్ఎం గంగాగౌరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు,

రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టుకు పన్నూరు విద్యార్థి



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి

విజయపురం: రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టుకు పన్నూరు చెందిన సెబాస్టియన్ ఎంపికయ్యాడు. గంగవరం మండలంలో నిర్వహించిన అండర్-17 బాలుర విభాగం వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబరచిన సెబాస్టియన్ జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. విజయనగరం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జానకిరామిరెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థిని, పీడీ గుర్రప్ప, ఉపాధ్యాయులు అభినందించారు.

పరసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



సేంద్రియ ఎరువును పరిశీలిస్తున్న రమేష్

పాలసముద్రం: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని మండల విస్తరణాధికారి రమేష్ తెలిపారు. బుధవారం వెంగళరాజుకుప్పం, పాలసముద్రం, ఆముదాల పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. చెత్త కేంద్రాల్లో ఎరువు తయారీని పరిశీలించారు. గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు టెండర్ల ఆహ్వానం

నగరి : ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటు వేగం పుంజుకుంది. బుధవారం షాపుల ఏర్పాటుకు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస రెడ్డి టెండర్లను ఆహ్వానించారు. నగరి, ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మొత్తం 11 మద్యం దుకాణాలకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఇందులో నగరి మున్సిపాలిటీలో 6 షాపులు, నింద్ర మండలంలో ఒక షాపు, విజయపురం మండలంలో 4 షాపులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారుడు నాన్ రీఫండబుల్ అప్లికేషన్ రుసుము రూ. 2 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులు నగరి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో స్వీకరిస్తామన్నారు. పూర్తి వివరాలకు 9440902549, 8985603534 నంబర్లను సంప్రదించాలన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కార్వేటినగరం: కార్వేటినగరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం దుకాణాల నిర్వాహణకు దరఖాస్తులు చేసుకోవచ్చని ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్వేటినగరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పాలసముద్రం, శ్రీరంగరాజపురం, వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల్లో ఎనిమిది మద్యం దుకాణాలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 9వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9160993955, 9440360014, 9703139207, 9959670010 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం మహాలయ అమావాస్యను పురస్కరించుకుని భక్తుల రద్దీ నెలకొంది. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని ఆలయాధికారులు తెలిపారు. రూ. 200 శీఘ్ర దర్శనం ద్వారా 848 మంది, రూ. 50 ప్రత్యేక దర్శనం టికెట్లు తీసుకుని 1,809 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ. 500 రాహుకేతు పూజా టికెట్ల ద్వారా 2,156 మంది, రూ.750 టికెట్లతో 902 మంది, రూ. 1,500 టికెట్లుకొని 233 మంది, రూ.2,500 టికెట్లతో 208 మంది, రూ.5 వేలు టికెట్ల ద్వారా 88 మంది పూజలు చేసుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 18,758 విక్రయాలు అయినట్లు ఆలయాధికారులు తెలిపారు.

బాపూజీకి ఘన నివాళి







నగరి: అర్బన్ హెల్త్ సెంటర్ ప్రాంగణంలో పారిశుధ్య పనుల్లో మున్సిపల్ కమిషనర్, గాంధీజీకి నివాళులర్పిస్తున్న ఆర్డీఓ, పుత్తూరు: నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు

నగరి, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల వ్యాప్తంగా బుధవారం గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు ప్రభుత్వ కార్యాలయాల్లో గాంధీజీ చిత్రపటానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ సాగించిన అహింసాయుత పోరాటం, ఆయన సేవలను కీర్తించారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాకారం చేసుకునేందుకు అందరూ కృషి చేయాలని పలువురు పిలుపునిచ్చారు.

నగరి : స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద చైర్మన్ పీజీ నీలమేఘం, కమిషనర్ కృష్ణారెడ్డి గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా ఆర్డీఓ కార్యాలయం, రూరల్ బ్యాంకు, యూపీహెచ్‌సీ, వ్యవసాయ కార్యాలయం, పశువైద్యశాల ప్రాంగణం తదితర ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రపరిచారు. కార్యాలయ ఆవరణలో మహాత్మాగాంధీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాటాలను స్మరించారు. తొమ్మిదిమంది శానిటరీ ఉద్యోగులను ఉత్తమ ఉద్యోగులుగా గుర్తించి మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఈ నవీన్, హేమశేఖర్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ వెంకటరెడ్డి, మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భార్గవి గాంధీజీ



కార్వేటినగరంలో..

చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కన్నియప్ప, కో-ఆప్షన్ సభ్యులు దస్తగిరి, ఇన్‌చార్జి ఎంపీడీఓ సతీష్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గాంధీ సిద్ధాంతాలు ఆచరణీయం

పుత్తూరు: మహాత్మగాంధీ శాంతి, సత్యం, ధర్మం, అహింస- సిద్ధాంతాలు ఆచరణీయమని మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి అన్నారు. గాంధీ జయంతి వేడుకలను మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించి మాట్లాడారు. అహింస అనే ఆయుధంతో బ్రిటీష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన మహోన్నత వ్యక్తి గాంధీజీ అని, ఆయన చూపిన బాటలో యువత సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, ఇన్‌చార్జి కమిషనర్ మూర్తి, డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈలు హేమశేఖర్‌రెడ్డి, కార్తికేయన్, ఆర్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

నింద్రలో..

నింద్ర: మండలంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక పంచాయితీ సచివాలయంలో సర్పంచ్ వసంతమ్మ గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామ సభ



గంగాదరనెల్లూరులో..

నిర్వహించారు. గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, స్వచ్ఛభారత్ కార్యక్రమాలపై సమీక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ధరణి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సభలో పనుల గుర్తింపు

విజయపురం : గాంధీ జయంతి పురస్కరించుకుని బుధవారం మండలంలోని శ్రీహరిపురం గ్రామ పంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. పలు అంశాలపై గ్రామస్తులతో చర్చించారు. తాగునీటి సరఫరా, వీధి దీపాలు, రోడ్లకు మరమ్మత్తులు మొదలైన పనులు చేయాలని తీర్మానించారు. స్వచ్ఛతా హి సేవలో భాగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పునరుద్ధరించి ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమం ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ లత, సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లక్ష్మీపతి, ఈఓ పీఎస్ మణి, జూనియర్ అసిస్టెంట్ క్రిష్ణయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, పట్నం ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధర నెల్లూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాఘవేంద్రరాజు, వైస్ ఎంపీపీ హరిబాబు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వచ్ఛభారత్ మండల కో-ఆర్డినేటర్ మనోహర్‌బాబు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాంధీజీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు ఎంపీడీఓ మోహన్‌మురళి నివాళులర్పించారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: పాలసముద్రం గ్రామసచివాలయంలో జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, సర్పంచ్ అయ్యప్ప, పంచాయతీ కార్యదర్శి ధరణిప్రసాద్ గాంధీజీ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించి గ్రామసభ నిర్వహించారు. ఇంజినీర్ అసిస్టెంట్ అక్షయ్, ఆరోగ్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

వెదురుకుప్పం: గ్రామాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని బొమ్మయ్యపల్లె సర్పంచ్ గోవిందయ్య అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి పనులకు సంబంధించి పంచాయతీ తీర్మానం చేశారు. అన్ని చోట్ల గ్రామ సభలు నిర్వహించి ముందుగా గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్‌లు శిల్ప, పుష్ప, భారతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నింద్రలో..





గ్రామ సభ నిర్వహిస్తున్న అధికారులు, శ్రీరంగరాజపురంలో..



పాలసముద్రంలో..



భూమిపూజ చేస్తున్న సర్పంచ్

భక్తిప్రపత్తులతో ఉత్తరా నక్షత్ర పూజలు



ఆలయంలో అన్నదానం చేస్తున్న భక్తులు

నగరి: బైపాస్ కూడలి సమీపంలోని శ్రీ ధర్మ శాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం అయ్యప్పస్వామి జన్మనక్షత్రమైన ఉత్తరా నక్షత్ర పూజలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అయ్యప్ప భక్తుల భజన పాటలతో ఆ ప్రాంతం మార్మోగింది. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు.భాగ్యలక్ష్మి ఎల్లప్ప రెడ్డి ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులు కన్నప్ప, మునస్వామి, రమేష్ బాబు, దుర్గాప్రకాష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలను తగ్గించాలి



మందులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ

వెదురుకుప్పం: మాతాశిశు మరణాలను తగ్గించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ప్రభావతిదేవి అన్నారు. బుధవారం పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మందుల పంపిణీ, వ్యాక్సిన్ ప్రిజర్వేషన్, రికార్డులను, ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ఆమె వెంట వైద్య సిబ్బంది ఉన్నారు.

నేరాల నియంత్రణకు కృషి



లక్ష్మీనారాయణ

గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీనారాయణ బుధవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో అన్ని సచివాలయాలు పర్యటించి ప్రజల సహాయ సహకారాలతో నేరాల నియంత్రణకు కృషిచేస్తానని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

అక్రమార్కులకే పెత్తనం

- ఆలయ ఆదాయంపై కన్ను వేసిన టీడీపీ నేత
- ఆలయ మాన్యం భూములను కబ్జా చేసిన వారికే చోటు
- వెనకడుగు వేస్తున్న ఉభయదారులు



శ్రీఅరిమాని గంగమ్మ

శ్రీరంగరాజపురం: మండలానికి తలమానికమైన తయ్యూరు పాయికట్టు శ్రీ ఆరిమానిగంగమ్మ ఆలయానికి విశిష్ట స్థానం ఉంది. గత శతాబ్ద కాలం తయ్యూరు పాయికట్టు ప్రజలు అందరు కలసి రాజకీయాలకు అతీతంగా దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఆరిమానిగంగమ్మ ఆలయం రాజకీయ రంగులు పులుముకున్నాయి. ఆలయంలో ఏ ఉత్సవం జరగాలన్నా తయ్యూరు పాయుకట్టు ప్రజలు కమిటీని నియమించుకుని ఉత్సవం నిర్వహించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనపడడం లేదు. టీడీపీకి చెందిన హిమచలపతి రెడ్డిని ఉత్సవ కమిటీ సభ్యుడిగా దేవదాయశాఖ ప్రధాన కార్యదర్శి సత్యానారాయణ నియమించడంతో పాయుకట్టు ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. గతంలో హిమచలపతిరెడ్డి మంగుంటలోని శ్రీలక్ష్మినరసింహస్వామికి చెందిన ఆలయ మాన్యం భూములను మంగుంట రెవెన్యూ లెక్కదాఖల సర్వే నంబర్: 110/4లో ఎకరం 15 సెంట్లు, 109/01లో 27 సెంట్ల భూమిని ఆక్రమించుకున్న వ్యక్తిని నియమించడంతో పాయికట్టు ప్రజలు, భక్తుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉభయదారులు, ప్రజలు ఉత్సవం నిర్వహించేందుకు వెనకడుగు వేస్తున్నారు. మండలంలోని ఓ బడా నాయకుడికి ముడుపులు ఇస్తే పదవులు గ్యారంటీ అని ప్రజలు చర్చించుకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ప్రజలు, భక్తులు అందరు కలసి ఐక్యమత్యంతో ఉత్సవాలు నిర్వహించుకోండి అని ఆదేశించినా కొంత మంది ఎమ్మెల్యే మాటను సైతం లెక్క చేయకుండా ఉత్సవ సేవా కమిటీ అని ఆర్డర్ తీసుకురావడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. నవరాత్రి ఉత్సవం జరుగుతుందో జరగదో అని పాయికట్టు ప్రజలు, భక్తులు, ఉభయదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీపీ

కార్వేటినగరం: సమస్యల పరిష్కారానికే గ్రామసభల లక్ష్యమని మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మ అన్నారు. బుధ వారం స్థానిక సచివాలయం ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను పరిష్కరించుకోవడానికి గ్రామసభలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. గ్రామసభలో సమస్యలపై పలువురు ఇచ్చిన వినతులను స్వీకరించారు. అలాగే పంచాయతీలో చేయాల్సిన పలు అభివృద్ధి పనులపై పంచాయతీ తీర్మానాన్ని ఆమోదించారు. ఎంపీపీ లత ఇన్‌చార్జ్, ఎంపీడీఓ లక్ష్మీపతి, ఈఓ పీఎస్ మణి, ఏపీఓ జాహ్నవి, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

పైపులైన్ల లీకేజీకి మరమ్మతులు

నింద్ర: నింద్ర గ్రామ పంచాయితీల్లో లీకేజీ అవుతున్న తాగునీటి పైపులైన్లకు బుధవారం మరమ్మతులు చేశారు. అలాగే పారిశుధ్యం మెరుగు పరిచారు. వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని అధికారులు ఆదేశించడంతో సర్పంచులు ఆ దిశగా చర్యలకు పూనుకున్నారు. అలాగే వివిధ దళితవాడల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు తొలగించారు.



నింద్రలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న జేసీబీ

సీఆర్పీ కుటుంబానికి ఆర్థికసాయం



బంగారుపాళెం: మండల విద్యాశాఖలో సీఆర్పీగా పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన సుధాకర్ శెట్టి కుటుంబానికి బుధవారం ఆర్థికసాయాన్ని అందజేశారు. బైరెడ్డిపల్లె మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, ఎంఈఓలు, సీఆర్పీలు కలసి రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని తిమ్మోజుపల్లెలో సుధాకర్‌శెట్టి భార్యాపిల్లలకు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు పాల్గొన్నారు.



సత్యవేడు-చిన్న పాండూరు ప్రధాన రోడ్డుకు తూర్పు భాగంలో శోత్రియ భూములను దున్నేసిన ఆక్రమణదారుడు

భూతాళ మాంత్రికులు



చిన్నపాండూరు ప్రధాన రోడ్డుకు పడమటి భాగంలో శోత్రియ భూములను దున్నేసిన ఆక్రమణదారులు

ఖాళీ భూమి కనిపిస్తే చాలు..అది ఎలాంటిదైనా తమ ఖాతాలో వేసుకోవడానికి కొందరు బరితెగిస్తారు. ఇళ్ల స్థలాలు పోయె.. చెరువులు పోయె..కాలువలు, దొరువుల పోయె.. చివరకు శోత్రియ భూములను అక్రమార్కులు వదలడం లేదు. చిన్నపాండూరులో ఇప్పుడు ఇలాంటి భూమిపైనే కొందరు కన్నేసి.. దున్నేశారు. అయినా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు ఉన్నారు.

- రాత్రికి రాత్రే దుక్కి దున్ని ఆక్రమణ
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు పంచాయతీ వీకేఆర్‌వై కాలనీ భూ ఆక్రమణలకు అడ్డాగా మారింది. ఈ పరిసర ప్రాంతాల్లో విరివిగా పరిశ్రమలు రావడంతో అక్కడి భూములకు ఎక్కడలేని గిరాకీ ఏర్పడింది. ప్రభుత్వ డీకేటీ భూమి ఎకరం రూ.కోట్లు పలుకుతోంది. భూముల ధరలకు ఒక్కసారిగా రెక్కలు రావడంతో అక్రమార్కుల కళ్లు ఆ భూములపై పడ్డాయి. ఇన్నాళ్లు వీకేఆర్‌వై కాలనీలో గిరిజనులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను దర్జాగా కొనుగోళ్ల పేరుతో ఆక్రమించుకున్నారు. తాజాగా సమీపంలోని పాదిరికుప్పం రెవెన్యూలోని 1,056 ఎకరాల శోత్రియ భూముల్లో అక్రమార్కులు పాగా వేస్తున్నారు. వారం క్రితం అర్ధరాత్రి ఆ భూముల్లో ఓ వైపు పొలం దున్నకం పనులకు పూనుకుని ఆక్రమణకు పావులు కదుపుతున్నారు. దున్నిన పొలం సత్యవేడు-చిన్న పాండూరు ప్రధాన రోడ్డు మార్గానికి ఆనుకుని ఉండడంతో ఆ భూములను కబ్జా చేసేందుకు తెర వెనుక కొందరు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే కొంతమేరకు షికారీలు ఆక్రమించుకుని ఆ భూమి తమ పూర్వీకులకు చెందినదిగా బుకాయిస్తూ గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారు. ఇలాగే కొనసాగితే శోత్రియ భూములు పూర్తిగా అక్రమార్కుల పాలయ్యే ప్రమాదం ఉంటోంది.

చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

శోత్రియ భూములు పెద్దఎత్తున ఆక్రమణలు జరుగుతున్నా తమకేమీపట్టనట్లు రెవెన్యూ యంత్రాంగం వ్యవహరిస్తోంది. పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో అనువైన ప్రాంతంగా ఉన్న శోత్రియ భూములు విచ్చలవిడిగా ఆక్రమణలకు గురవుతున్నాయి. ఓవైపు దుక్కి దున్నకాలు, మరోవైపు గ్రావెల్ అక్రమ రవాణా, షికారీల గుడిసెలు.. ఇలా ఆక్రమించినోడిదే భూమి అన్న చందాన అక్రమార్కుల పాలవుతున్నాయి. ఎంతో విలువైన భూములు అన్యాక్రాంతమవుతుంటే నియంత్రించాల్సిన రెవెన్యూ శాఖ చోద్యం చూస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రధాన రోడ్డు కిరువైపులా ఆక్రమణలు

చిన్న పాండూరు-సత్యవేడు ప్రధాన రోడ్డు మార్గంలోని వీకేఆర్‌వై కాలనీ సమీపంలో రోడ్డుకు తూర్పు, పడమర రెండు వైపులా సుమారు 100 ఎకరాలకు పైగా కొన్ని రోజులుగా దుక్కి దున్నకాలు చేపట్టిన ఆక్రమిత భూమిలో పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. ఎకరా రూ. 10కోట్లకు పైగా విలువ కలిగిన ఈ ప్రాంతంలో ఇంత పెద్దఎత్తున ప్రభుత్వ భూములు ఆక్రమణల పాలవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం



శోత్రియ భూముల్లో అక్రమంగా దున్నకాల విషయం ఆలస్యంగా మా దృష్టికి వచ్చింది. వివిధ కేసులకు సంబంధించి హైకోర్టుకు హాజరయ్యాను. వచ్చిన వెంటనే శోత్రియ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడ జరుగుతున్న ఆక్రమణలు, ఇతర కార్యకలాపాలపై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

– రాజశేఖర్, తహసీల్దార్, వరదయ్యపాళెం

కప్పలు బెక బెక.. వరుణుడు వచ్చెనిక..!





రోకలికి కట్టిన కప్పలతో చేస్తున్న ఊరేగింపు, గంగరాయికి సమర్పిస్తున్న పొంగళ్లు

- గంగినాయనిపల్లెలో ఘనంగా కప్పదేవర

బైరెడ్డిపల్లె: కొంత కాలంగా వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో పంటలు ఎండుముఖం పడుతున్న తరుణంలో మండలంలోని గంగినాయనపల్లె గ్రామస్తులు బుధవారం వర్షం కోసం కప్పదేవర నిర్వహించారు. తొలుత గ్రామ సమీపంలోని పాడుబడ్డ బావిలో నుంచి కప్పలను సేకరించారు. రోకలికి ఇరువైపులా వాటిని కట్టి గ్రామంలో ఊరేగించారు. ఇంటింటికీ వెళ్లి భిక్షాటన చేశారు.ఆ తర్వాత గ్రామ సమీపంలోని దామిరొడ్డు వద్ద గంగరాయికి ప్రత్యేక పూజలు చేశారు. పొంగళ్ల వండి నైవేద్యం సమర్పించారు. గ్రామస్తులంతా బైరెడ్డిపల్లె పెద్దచెరువులో వానదేవుణ్ని వేడుకుంటూ నోరు లబ..లబ కొట్టుకుంటూ పరుగులు తీశారు. కప్పల బెకబెకలు..గ్రామస్తుల లబబ..లబలు..వరుణదేవుడు ఆలకించాడేమోగానీ సాయంత్రం అయ్యేసరికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. మేఘావృతమై 6.30 గంటల నుంచి ఎడతెరపిలేకుండా వర్షం కురవడంతో గ్రామస్తుల ఆనందానికి అంతులేకుండా పోయింది. ఖరీఫ్‌లో సాగు చేసి వేరుశనగ పంట చేతికందే సమయంలో వర్షం కురవడం ఆనందంగా ఉందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.